క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డా.మధుసూదన్‌రాజు

పెద్దపప్పూరు: మండలంలోని పెండేకల్లు ప్రాథమిక పాఠశాలలో బుధవారం తాడిపత్రి డివిజన్ కంటి వైద్యనిపుణుడు మధుసూదన్ రాజు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 23మందికి కంటిపరీక్షలు నిర్వహించి, దృష్టి లోపం ఉన్న ఇద్దరిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేశవరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి: 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో రిలే ప్యానల్స్ మారుస్తున్న నేపథ్యంలో గుత్తి ఆర్‌ఎస్ ఫీడర్‌లో గురువారం నుంచి ఈ నెల 8 వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశముందని ఏపీఎస్‌పీడీసీఎల్ సాయి శంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రిలే ప్యానల్స్ మారుస్తున్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశమున్నందున వినియోగదారులు సహకరించాలన్నారు. అయితే కరెంట్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. టెక్నికల్ సమస్య కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రహదారి నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజగోపాల్

యాడికి: డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలని తాడిపత్రి ఎంవీఐ రాజగోపాల్ సూచించారు. మండలంలోని రాయల చెరువు గ్రామంలో ఉన్న సీవీఆర్ హైస్కూల్‌లో బుధవారం ఆయన రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించక పోవడమే ప్రమాదాలకు కారణమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో సీవీఆర్ కరస్పాండెంట్ లారెన్స్‌బాబు, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

జెన్‌కో సిబ్బందితో ఆర్డీఓ సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

యాడికి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జెన్‌కో సిబ్బందితో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. అనంతరం కమలపాడు పీఎస్‌పీ ప్రాజెక్టుకు సంబంధించి కమలపాడు, కుందనకోట, చింతలాయపల్లి భూముల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, ప్రాజెక్టు విషయాలు ఆరా తీశారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోనున్న రైతుల వివరాలు రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, జెన్కో డీఈ ఆంజనేయులు, ఆర్‌ఐ క్రిష్టప్ప, సర్వేయర్ సాయి, మౌలాలి, వీఆర్‌ఓలు భీమేశ్వర రెడ్డి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. బుధవారం మర్తాడు పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ముంబయిలోని మాస్టర్ ఆర్ట్ కాంపిటీషన్ వారు జనవరిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా పాఠశాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఎంట్రీలు పంపారన్నారు. అందులో భాగంగా ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులకు పోస్టు ద్వారా పురస్కారాలు పంపించారన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు వెంకటరమణను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు వసుంధర, ఆదినరసమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాము, వైస్ చైర్మన్ ప్యారీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు రంగనాథుడు



తొండపాడులోని రంగనాథస్వామి ఆలయం

కోరిన కోర్కెలు తీర్చే దైవంగా బొలికొండ రంగనాథస్వామి వారు పూజలు అందుకుంటున్నారు. గురువారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

• నేటి నుంచి 'బొలికొండ' బ్రహ్మోత్సవాలు • 12న రథోత్సవం

గుత్తి రూరల్: దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి ధర్మస్థాపన చేసే ధర్మ సంస్థాపకుడు.. ఆర్తితో శరణు వేడే వారి వెంట ఉండి నడిపించే ఆర్తత్రాణ పారాయణుడై మహావిష్ణువు శేషతల్పంపై శయనించి బొలికొండ రంగనాథస్వామి నామంతో కొలువు దీరి గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో భక్తులచే అశేష పూజలు అందుకుంటున్నాడు. స్వయంవక్త మూర్తి మహిమాన్వితుడైన దేవుడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయం గుత్తి పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కన తొండపాడు గ్రామంలో ఉంది.

రెండు ఆలయాల సంగమం

తొండపాడులోని రంగనాథస్వామి ఆలయం రెండు భాగాలుగా కనిపిస్తుంది. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ఆలయం ఒకటికాగా.. ఈ ఆలయానికి కొండ పైన సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మరో ఆలయం ఉంది. కొండపైన స్వామి వారు బొలికొండ రంగనాథస్వామిగా పూజలందుకుంటుండగా గ్రామంలోని ఆలయంలో రంగనాథుడు, మాణిక్యరంగనాథస్వామి పేరుతో పూజలందుకుంటున్నారు. కాలక్రమంలో ఆలయంలో రెండు స్వాముల మూల విరాట్‌లు కొలువుతీరి పూజలందుకుంటున్నాయి.

మహావిష్ణువు సేదదీరిన చోటు...

ఈ ఆలయానికి ఎదురుగా కొంత దూరంలో ఉన్న కొండపై రంగనాథస్వామి ఆలయం ఉంది. బొలికొండ రంగనాథస్వామి ఈ క్షేత్రంలో కొలువు తీరడానికి ఒకసారి విష్ణువు భూలోక విహారం చేస్తూ ఈ ప్రాంతానికి చేరుకున్నాడు. ఇక్కడి ప్రకృతి రమణీయ దృశ్యాలను చూస్తూ కొండపై విశ్రమించారు. కొండ చుట్టుపక్కల ఆశ్రమాలను నిర్మించుకుని తపస్సు చేస్తూ ఉన్న మునిపుంగవులకు కొండపై ఏదో దివ్యతేజస్సు గోచరించి విష్ణువు విశ్రమించిన చోటకు వచ్చారు. దివ్యతేజస్సుతో వెలుగొందుతున్న స్వామిని అనేక నామాలతో కీర్తించారు. వారి భక్తికి మెచ్చిన మహా విష్ణువు వరం కోరుకోమన్నాడు. స్వామీ.. మీరు ప్రకృతి రమణీయతతో ఆహ్లాదపరుస్తూ ఉన్న ఈ కొండపై శాశ్వతంగా కొలువుదీరి నిత్యం తమను సేవించుకునే భాగ్యాన్ని ప్రసాదించండి అని మునిపుంగవులు వేడుకున్నారు. మునిపుంగవుల కోరికను మన్నించిన విష్ణువు కొండపైన బొలికొండ రంగనాథస్వామి రూపంలో కొలువు దీరాడని స్థల పురాణం చెబుతోంది.

ఇంటి దేవుడిగా బొలికొండ రంగనాథస్వామి

తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథస్వామి ఆలయ చుట్టుపక్కల గ్రామాల్లో రంగనాథుడిని ఇంటి దేవుడుగా కొలుస్తూ వారి ఇళ్లలోని పెద్దలు, పిల్లలకు రంగనాయకులు, రంగస్వామి, రంగనాథ్, రంగయ్య, రంగమ్మ, లక్ష్మీరంగమ్మ అనే పేర్లను పెట్టుకుంటారు. అలాగే ఈ గ్రామాల్లో తిరునాలను అతి పెద్ద పండుగగా జరుపుకుంటారు. బంధుమిత్రులను ఆహ్వానించి బ్రహ్మోత్సవాల మూడు రోజులు ఘనంగా జరుపుకుంటారు.

బొలికొండ, శ్వేతగిరిగా ప్రసిద్ధి....

రంగనాథుని ఆలయం ఉన్న ఈ కొండనే శ్వేతగిరి అని కూడా పిలుస్తారు. తెల్లటి రాళ్లు ఉన్న కొండ కనుక శ్వేతగిరి అని పేరు వచ్చినట్లు పెద్దలు చెబుతారు. ఈ కొండకే బొలికొండ అని పేరు కొండపై తెల్లటి పొడలు (బొల్లి) వచ్చినట్లుగా ఉండడం వల్ల బొలికొండ అని పేరు వచ్చిందని ప్రచారంలో ఉంది. బొలికొండ మీద ఉన్నది రంగనాథ స్వామి కనుక ఈ స్వామికి బొలికొండ రంగనాథ స్వామి అని పేరు. స్వామి రూపం స్పష్టంగా ఉండదు. రెండు కాళ్లు ఉండి మధ్యలో దానిని కలుపుతూ చిన్న గోడగా ఉంటుంది. కాబట్టి 'పుట్టు శిల' అంటారు. ఆలయంలో ప్రతి నెలా శుక్లపక్షంలో ఏకాదశి రోజు ఏకాదశి వ్రతం, ద్వాదశి రోజు తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది. ప్రతి సంవత్సరం మాఘమాసంలో శుక్ల పక్ష నవమి మొదలుకొని పౌర్ణమి వరకూ తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి.



రంగనాథస్వామి మూలవిరాట్

బ్రహ్మోత్సవాలు ఇలా..



స్వామి రథం

బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణం, అంకురార్పణతో ప్రారంభమవుతాయి. 7న సింహ వాహనోత్సవం, 8న శేషవాహనోత్సవం, 9న హనుమత్ వాహనోత్సవం, 10న గరుడవాహనోత్సవం, 11న గజవాహనం, కల్యాణోత్సవం, 12న రథోత్సవం(తేరు), 13న పారువేట అశ్వవాహనం, 14న వసంతోత్సవం, హంసవాహనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

వేళకు వచ్చిన ఆర్టీసీ బస్సులు



సమయానికి వచ్చిన ఆర్టీసీ బస్సు

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: మండల కేంద్రానికి బుధవారం ఆర్టీసీ బస్సులు వేళకు రావడంతో ప్రజలు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి బస్సులు సక్రమంగా రాకపోడంతో ఇబ్బందులు పడుతుండటంతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన తాడిపత్రి డిపో మేనేజర్ శంకర్ సూచన మేరకు ఆర్టీసీ డిపో డ్రైవర్లు సమయ పాలన పాటిస్తూ బస్సులు నడిపారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి మృతి

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరుకు చెందిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.బుధవారం ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన మణెమ్మ(64) అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా నివసిస్తోందన్నారు. సోమవారం రాత్రి ఇంట్లో కొవ్వొత్తి వెలిగించుకొని నిద్రిస్తుండగా.. ప్రమాదవశాత్తూ త్తువ్వొత్తి మంటలు చీరకు వ్యాపించాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టెమీ చికిత్సతో గుండెజబ్బు మరణాల నివారణ



స్టెమీ చికిత్స పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి

పామిడి: స్టెమీ చికిత్సతో గుండెజబ్బు మరణాలను నివారించవచ్చని సీహెచ్‌సీ వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆస్పత్రిలో నిర్వహించిన స్టెమీ చికిత్స భరోసాపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఛాతీలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండడం, గుండె దడ, స్పృహ కోల్పోడవడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలన్నారు, అవి ప్రారంభమైన మొదటి గంటలోపే వైద్యులను సంప్రదించాలన్నారు. రోగికి పరీక్షలు నిర్వహించి రూ.45వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతిఒక్కరూ స్టెమీ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌నర్స్ శివకుమారి, ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏఎస్‌ఎం, ఆశా వర్కర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ప్యాపిలికి చెందిన రామన్న, శ్రీనివాసులు బైక్‌లో గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి బైక్‌లో ప్యాపిలికి బయలుదేరారు. అయితే బైక్ వెనుక కూర్చున్న శ్రీనివాసులు స్పీడ్ బ్రేకర్ వద్ద జారి కింద పడ్డాడు. స్థానికులు గమనించి గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

బత్తలపల్లి: బత్తలపల్లి–ధర్మవరం ప్రధాన రహదారిపై పోట్లమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..ధర్మవరం నుంచి తాడిపత్రికి వెళ్తున్న టాటా ఏస్ వాహనం, తాడిపత్రి నుంచి బెంగుళూరుకు వెళ్తున్న సిమెంట్ లారీ పోట్లమర్రి వద్ద మంగళవారం అర్ధరాత్రి ఢీ కొన్నాయి. తాడిపత్రికి చెందిన టాటా ఏస్ డ్రైవర్ కార్తీక్ కుమార్ వాహనంలో ఇరుక్కుపోయాడు. బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో అతడిని బయటకు తీసి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు. కార్తీక్ కుమార్ తండ్రి ఓబులేసు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బడ్జెట్ ప్రతుల దహనం



పుట్లూరులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు



పెద్దవడుగూరులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పుట్లూరు/పెద్దవడుగూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో పేదలు, రైతులు, సామాన్య ప్రజలకు మంచి జరిగేలా ఎలాంటి కేటాయింపులు చేయలేదని రైతు సంఘాల నాయకులు నిరసన తెలిపారు. పుట్లూరు మండలంలోని కడవకల్లు గ్రామంలో మంగళవారం బడ్జెట్ ప్రతులకు దహనం చేశారు. విభజన చట్టంలో సూచించిన కేటాయింపులను రాష్ట్రానికి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటచౌదరి, సూరి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో సీపీఐ, సీపీఎం నాయకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకట్రాముడుయాద్, సీపీఎం కార్యదర్శి దస్తగిరి, రైతు సంఘం నాయకుడు ఈశ్వరరెడ్డి, నాయకులు ఆదినారాయణ, ఓబిరెడ్డి, రంగస్వామి, అల్లాబకాస్, ఉసేన్‌పీరా, కిరణ్, శ్రీనివాసరెడ్డి, ముత్యాలరెడ్డి, నారాయణస్వామి, వీరాంజనేయులు, పెద్దన్న, శేఖర్, అల్లావలి పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన వారితో కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి బుధవారం తెలిపారు. కళాశాలలో ఇటీవల ఇన్ఫోసిస్ కంపెనీ వారు మూల్యాంకణ, ఇంటర్వ్యూలను నిర్వహించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రాంలో ఎనిమిది మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారన్నారు. మహిళా అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని ఎంపికైన విద్యార్థులను సిస్టం ఇంజినీర్లగా నియామక పత్రాలను అందజేశారు. వీరికి వార్షిక వేతనంగా రూ.3.6 లక్షల ప్యాకేజి అందజేస్తారు. ఈ సందర్భగా కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ అత్యుత్తమ కెరీర్ అవకాశాలు కల్పించే లా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, అధ్యాపకులు అభినందించారు.

శ్మశాన వాటికలో చెత్త డంప్ నివారించండి



క్రైస్తవ కొత్త శ్మశాన వాటికలో చెత్తాచెదారం వదులుతున్న పంచాయతీ వాహనం



శ్మశాన వాటికలో డంప్ చేసిన చెత్తాచెదారం

పామిడి: పట్టణంలోని క్రైస్తవ కొత్త శ్మశాన వాటికలో పంచాయతీ చెత్తాచెదారం డంప్‌ను నివారించాలని క్రైస్తవులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తా చెదారం డంప్ చేయడం వల్ల దుర్వాసతో పాటు మృతదేహాలను పూడ్చడం ఇబ్బందిగా మారిందన్నారు. క్రైస్తవ్యం స్వీకరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాలకు సంబంధించి క్రైస్తవ సంప్రదాయ భూస్థాపితం నిమిత్తం ఈ శ్మశాన వాటికను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ శ్మశాన వాటిక మొత్తం చెత్తాచెదారంతో కూడిన డంప్‌మయమైందన్నారు. క్రైస్తవ శ్మశాన వాటికలో చెత్తను డంప్ చేయరాదంటూ పంచాయతీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం శూన్యమన్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి శ్మశాన వాటిక స్థలంలో చెత్తను డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలి



గుంతకల్లులో రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మికులు



గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి రూరల్: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరసయ్య డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడానికే మోడీ సర్కారు లేబర్ కోడ్స్ అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లేబర్‌కోడ్‌లను అమలు చేయడం వల్ల కార్మికులపై పనిభారం పెరగడమే కాకుండా ఉద్యోగం లేక రోడ్డున పడాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు జగదీష్, నాయకులు ఎస్.కె.ఎం.బాషా, రంగనాయకులు, తిరుపాల్, ప్రేమ్, రవి, రాజేష్, రంగమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నిర్మల, మునిసిపల్ పారిశుధ్య కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, రామాంజనేయులు, కార్మిక సంఘం నాయకులు రాజు, రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, వెంకటలక్ష్మి, మహిళా సంఘం నాయకురాళ్లు రేవతి, కవిత, సీఐటీయూ మహేష్ పాల్గొన్నారు.

నీరు వృథా.. తప్పదు వ్యథ



పెద్దవడుగూరులో లక్ష్ముంపల్లి రోడ్డు సర్కిల్ వద్ద గండికోట పైపులైన్ లీకేజీ అవుతున్న దృశ్యం



పామిడిలోని క్రైస్తవ సమాధుల తోటలో సత్యసాయి వాటర్ పైప్‌లైన్ లీకేజీ దృశ్యం

పామిడి: గుక్కెడు మంచి నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పట్టణంలోని క్రైస్తవ సమాధుల తోటలో వారం రోజులుగా సత్యసాయి వాటర్ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. దీంతో నీరంతా వృథాగా పారుతోంది. ప్రతి నీటి బొట్టును సంరక్షిస్తాం... నీటి వృథాను అరికడదాం అన్న నాయకుల మాటలు ప్రకటనలే పరిమితం అనడానికి ఈ నీటి వృథానే నిదర్శనం. నీరు లీకవడతో శ్మశాన వాటిక బురమయమవుతోంది. సత్యసాయి ప్రాజెక్ట్ నిర్వాహకులు అలసత్వం వీడి, తక్షణం పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటివృథాను అరికట్టాలని క్రైస్తవులు కోరుతున్నారు.

గుంత తవ్వారు.. వదిలేశారు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద లక్ష్ముంపల్లి రోడ్డు సర్కిల్‌లో నెల రోజులుగా గండికోట పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథా అవుతోంది. పది రోజుల క్రితం పైపులైన్ మరమ్మతు చేయాలని పంచాయతీ సిబ్బంది గుంత తవ్వారు పైపులైన్ వరకూ మట్టిని తొలగించారు. పంప్‌హౌస్ నుంచి గ్రామంలోకి నీరు సరఫరా అయ్యే పైపులైన్ కావడంతో మరమ్మతు చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో గుంత నిండి నీరంతా రోడ్డు పైకి పారడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. నీటి సరఫరా ఆగిన వెంటనే తిరిగి మురుగు నీరు పైపుల్లోకి వెళ్లడంతో ఇళ్లకు మురుగునీరు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీటిని వాడటం వలన రోగాల బారిన పడాల్సిన పరిస్థితి దాపురిస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గండికోట పైపులైన్ మరమత్తు చేయాలని కోరుతున్నారు.